వన్నె తగ్గని వనరులుగా..

జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న కూసుమంచి ఉన్నత పాఠశాల

- విద్య, క్రీడల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు
- ఎందరినో తీర్చిదిద్దిన విద్యాలయంగా గుర్తింపు
- మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇక్కడి విద్యార్థులే


కూసుమంచి ఉన్నత పాఠశాల (ఇన్‌సెట్) పాఠశాల పాత భవనం

కూసుమంచి: కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ విద్యార్థుల సంఖ్య జిల్లాలోనే అత్యధికం. ప్రతీ ఏడాది 300కు పైగా అడ్మిషన్లు అవుతుండగా.. 950 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. 1956లో ప్రాథమిక పాఠశాలగా ఏర్పాటై 1971లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. నాటి నుంచి నేటి వరకు ఎందరో విద్యార్థులు ఇక్కడ చదివి ఉన్నతులుగా ఎదిగారు.. ఎదుగుతున్నారు.

మాజీ డీజీపీ చదివిన బడి..

ఎందరో ప్రముఖులను తీర్చిదిద్దిన బడిగా దీనికి గుర్తింపు ఉంది. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన మాజీ డీజీపీ, మాజీ టీపీఎస్సీ చైర్మన్ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డి, రాజుపేట గ్రామానికి చెందిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలతో పాటు అనేక మంది ఉన్నత ఇక్కడ చదివి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. బాలూ జాదవ్, రేలా జనార్ధన్‌రెడ్డి ఏఎస్పీ కేడర్ కాగా వారిలో బాలుజాదవ్ ఇటీవల మరణించారు. ఇక వడిత్య వెంకటేశ్వర్లు, వెంకట్రామ్, వడిత్య నారాయణ తదితరులు వివిధ శాఖల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కాగా, రాష్ట్రంలో ఇటీవల రెండు పాఠశాలల్లో గిరిజన సంస్కృతి సమ్మేళనాలు నిర్వహించగా.. ఈ పాఠశాల ఉండడం గమనార్హం.

చదువుల్లో సత్తా..

ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ ప్రముఖ ట్రిపుల్ ఐటీల్లోనూ ప్రవేశాలు పొందుతున్నారు. మండలంలో ఇంగ్లిష్ మీడియంలో చదివే పది విద్యార్థులు ఇక్కడ ఎక్కువగా ఉంటుండగా.. 2024–25 విద్యా సంవత్సరంలో 132 మందికి గాను 117 మంది ఉత్తీర్ణులయ్యారు. 547 మార్కులతో సత్యనిషి టాపర్‌గా నిలిచింది. అంతేకాక చాలా మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా పురస్కారం (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపిక కావడం విశేషం. ప్రతీ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫొటోలతో కరపత్రాలు, ఫ్లెక్సీలు వేయించి ప్రచారం చేయడం మరో విశేషం.

క్రీడల్లోనూ మెరికలు...

ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు క్రీడల్లో తమ సత్తా చాటుతున్నారు. పూర్వ విద్యార్థులైన వడిత్య వినోద, నాగమణి, సామి వీరన్ వడిత్య విజయ్‌లు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పలు పోటీల్లో పాల్గొనగా.. మరికొందరు రాణిస్తున్నారు. విద్యార్థులు చదువు, క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉంటున్నారు.

చక్కని వసతి..

కూసుమంచి ఉన్నత పాఠశాల గతంలో పాత భవనాల్లో ఉండగా.. ప్రస్తుతం ఆరెకరాల విస్తీర్ణంలో కొనసాగుతోంది. కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా 30 గదులు రెండు అంతస్తుల్లో ఉండగా.. సరస్వతీ, మహాత్మాగాంధీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. విశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఔదార్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం..



మా పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా మేం కృషి చేస్తున్నాం. అందరి కృషితోనే 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతున్నాం. ఎందరో విద్యార్థులు వివిధ హోదాల్లో స్థిరపడగా.. మాజీ డీజీపీ ఈ పాఠశాల విద్యార్థి కావడం గర్వకారణం.

– రాయల వీరస్వామి, హెచ్‌ఎం, ఎంఈఓ

గర్వంగా ఉంది..



నేను మా ఊరిలోని ఉన్నత పాఠశాలలో చదువుకోవడం గర్వంగా ఉంది. నేను అక్కడ 5 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నా. నాడు మా గురువులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో నేడు చాలామంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డాం. మరింత అభివృద్ధి చెందాలి.

– రేలా జనార్ధన్‌రెడ్డి, ఏఎస్పీ (ఏఆర్), సూర్యాపేట

'ప్రైవేట్'ను తలపించేలా..

మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చుకొని ప్రైవేట్ పాఠశాలను తలపిస్తోంది. విశాలమైన తరగతి గదులు, గ్రౌండ్, మినరల్ వాటర్, పాఠశాల చుట్టు ప్రహరీ, అదనపు తరగతుల నిర్మాణం ఇలా ప్రభుత్వం నుంచి వస్తున్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల సమీపంలో పలు సంక్షేమ శాఖలకు చెందిన హాస్టళ్లు ఉండడంతో అడ్మిషన్లు పెరిగేందుకు దోహదపడుతున్నాయి.


విద్యార్థుల భోజన వసతికి నిర్మించిన మెస్

అద్వితీయం..

- అడ్మిషన్లలో ఆదర్శంగా నిలుస్తున్న ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్
- జిల్లాలో రెండు, నగరంలో ప్రథమ స్థానం


ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ 'ప్రైవేటు'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచుకుంటుంది నగరంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఐక్యతగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య(అడ్మిషన్లు)ను పెంచుకుంటూ అందరి మన్ననలు పొందుతోంది.

నగరంలో టాప్..

జిల్లాలో 1,216 పాఠశాలలుండగా.. వాటన్నింటిలోనూ ప్రతీ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో జిల్లాలోని కూసుమంచి పాఠశాల అత్యధిక విద్యార్థులు ఉంటుండగా ద్వితీయ స్థానంలో నగరంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ హైస్కూల్ ఉందని, నగరంలో 75 పాఠశాలల్లోనూ అత్యధిక విద్యార్థులున్న పాఠశాల ఇది గుర్తింపు పొందిందని విద్యాశాఖ చెబుతోంది. పాత అడ్మిషన్లను కాపాడుకోవడంతో పాటు కొత్త అడ్మిషన్లు పెంచుకుంటోంది.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత



విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందిస్తూ ముందుకు సాగుతున్నాం. బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం. ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తల్లిదండ్రులను సైతం ఆహ్వానిస్తూ పలు సూచనలు చేస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం

ప్రవేశాలిలా..

సంవత్సరం	మొత్తం విద్యార్థులు	ఎస్సెస్సీ విద్యార్థులు
2019-20	750	118
2020-21	580	99
2021-22	650	106
2022-23	780	118
2023-24	796	136
2024-25	851	163

క్రీడల్లోనూ సత్తా..

చదువుతో పాటు క్రీడల్లోనూ ఈ పాఠశాల విద్యార్థులు రాణించేలా తర్ఫీదు ఇస్తున్నారు. దీంతో నేషనల్ అథ్లెటిక్స్‌లో సైతం విద్యార్థులు అశోక్, కిరణ్, తిరుపతి, రమేష్, రాజ్‌కుమార్, రాము, గణేష్, గోపాల్, ముకేష్, జశ్వంత్‌లు పాల్గొన్నారు. పలు పోటీల్లో సైతం అవార్డులు అందుకున్నారు.

వినతుల వెల్లువ..

➡ బస్‌పాస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బస్‌పాస్ చార్జీలపై 20 శాతం పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యాన ఆర్టీసీ పీఓ ఎస్.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, గౌతమ్, హరికృష్ణ, చరణ్, నాగరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

➡ నోటరీ నోటిఫికేషన్ జారీ చేయండి


వినతిపత్రం అందిస్తున్న దిలీప్‌చౌదరి

ఖమ్మంలీగల్: రాష్ట్రంలో గత 12ఏళ్లుగా నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో అర్హులైన న్యాయవాదులు అవకాశాలను కోల్పోతున్నారని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఈమేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి బుద్ధప్రకాష్‌కు బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు.

➡ వెల్‌నెస్ సెంటర్‌లో మందులు సరఫరా చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌లో సరిపడా మందులు లేక పెన్షనర్లు, ఉద్యోగులు, జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ బుధవారం కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసింది. సంఘం బాధ్యులు ఎల్.గోపీచంద్, కల్యాణం నాగేశ్వరరావు, పి.ఝాన్సీ, చావ చిట్టెమ్మ, రమాశేఖరం, మధు, భాస్కరరావు, గణపతి, రామకృష్ణ, నాగేంద్రబాబు, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

➡ మహిళకు మోకాలి మార్పిడి..


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్ కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: దీర్ఘకాలికంగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన జోనిబోయిన సత్యవతికి రోబోటిక్ బైలేటరల్ మోకాలి మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసినట్లు యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోకాలి రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా – రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరాలు మాట్లాడారు. సర్జరీ తర్వాత ఫిజియోథెరపీ చేసి ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. గత 30 ఏళ్లుగా హైదరాబాద్‌లోని యశోద హాస్పటల్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4 బ్రాంచ్‌లు సికింద్రాబాద్, సోమాజిగూడ, మలక్‌పేట్, హైటెక్ సిటీలలో అనుభవజ్ఞులైన వైద్యులచే, అధునాతన సాంకేతికతలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పేషంట్ సత్యవతి పాల్గొన్నారు.

➡ ప్రోత్సాహక నగదు అందజేత

కామేపల్లి: మండలంలోని బాసిత్‌నగర్ జెడ్పీ హైస్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతితో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ధరావత్ హరిణికి రూ.10 వేలు, జర్పుల రాజేశ్‌కు రూ.5 వేలు చొప్పున బాసిత్‌నగర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం ప్రోత్సాహక నగదు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జాజిరి గిరిధర్‌సింగ్, జర్పుల సక్రాం, భద్రు, రాంకిషన్, హెచ్‌ఎం ఈర్యా పాల్గొన్నారు.

➡ విద్యార్థికి 'ఎస్‌బీఐటీ' చేయూత


చెక్కు అందిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: గతేడాది వచ్చిన పాలేరు రియర్వాయల్ వరదల్లో కూసుమంచి మండలం పాలేరు నాయకన్‌గూడెం వద్ద ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థి షేక్ షరీఫ్ తల్లిదండ్రులు మృతి చెందడంతో చదువులకు ఇబ్బంది కలగకుండా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును బుధవారం ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ అవగాహన సదస్సు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజనం వర్కర్లు, స్వచ్ఛ మిత్రలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.చలపతిరావు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంపునకు కృషి చేయాలన్నారు. సీఆర్‌పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ నకిలీలపై అప్రమత్తత అవసరం

రఘునాథపాలెం/కామేపల్లి: రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం రఘునాథపాలెం మండలంలోని రాంక్యాతండాలో పంటలసాగు, విత్తన ఎంపికలో జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. అలాగే కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏడీఏ వెంకటేశ్వరరావు పర్యటించి బీటీ–3 విత్తనాలను సాగు చేయొద్దని రైతులుకు సూచించారు. ఏఓ తారాదేవి, ఏఈఓ శ్రీకన్య, రైతులు పాల్గొన్నారు.

➡ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల పరిశీలన


అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ చీఫ్ జానయ్య

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: వరదలతో తీవ్రంగా నష్టపోయిన రాకాసితండా గ్రామాన్ని బుధవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తతపై అవగాహన కల్పించారు. వరదల సమయాన రక్షించేందుకు నలుగురిని సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ చీఫ్ జానయ్య, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం తీర్థాలలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం పరిశీలించి వరదలకు రాక ముందే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధాకర్, వెంకటేష్, రాజు, వరుణ్, సాయి, త్రినాథ్, లోకేష్, పాల్గొన్నారు.

➡ స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణ

రఘునాథపాలెం/కామేపల్లి: రఘునాథపాలెం మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల స్కావెంజర్లకు పారిశుద్ధ్యం అంశంపై ప్రత్యేకంగా ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు పారిశుద్ధ్య పరికరాల వినియోగం, రసాయనాల వాడక పద్ధతులు, ఫీల్డ్ లెవెల్‌లో అనుసరించాల్సిన తీరుతెన్నులపై వివరించారు. అనంతరం విశిష్ట సేవలందించిన ఇద్దరు స్కావెంజర్లు ఎంపీపీఎస్ రఘునాథపాలెం పి.జ్యోతి, ఎక్స్ రోడ్ డి.మంగతాయిలను సన్మానించారు. ఎస్‌హెచ్.రంగారావు, సీఆర్‌పీలు, స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు. కామేపల్లి రైతు వేదికలో ఎంఈఓ వెంకట్ మాట్లాడగా.. రిసోర్స్ పర్సన్ వెంకన్న, సుజాత, విజిత, సీఆర్పీలు పాల్గొన్నారు.

➡ గురుకుల పాఠశాల తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేసి అడ్మిషన్లపై ఆరా తీశారు. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు.

➡ డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వైరా రోడ్డు జిల్లా కోర్టు ఎదుట నిర్వహించే డ్రెయినేజీ నిర్మాణ పనులను వర్షాలు కురవక ముందే త్వరగా పూర్తి చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌కె.మీరా సాహిబ్, ఉపేందర్ పాల్గొన్నారు.

➡ కొనసాగుతున్న భూభారతి సదస్సులు

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం/తిరుమలాయపాలెం/కామేపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే భూ భారతి సదస్సులో బుధవారం రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో జరిగిన గ్రామ సభలో 335 మంది దరఖాస్తులు అందగా, జీకే బంజరలో 40, నగరంలోని దానవాయిగూడెంలో 116 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెంలో 41, సోలీపురంలో 62 దరఖాస్తులు, కామేపల్లి మండలం పాతలింగాలలో దరఖాస్తులు స్వీకరించామన్నారు.

➡ కలెక్టర్‌కు ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఆయుష్ శాఖ వైద్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయిని కలిసి ఈనెల 21న ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. వైద్యులు కె.పద్మావతి, పి.దశరథ్, కనకలక్ష్మి, ప్రకాష్, బాబు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.